క్లుప్తంగా

వాయుపుత్రునికి విశేష పూజలు


అలంకరణలో ఆంజనేయస్వామి

కౌతాళం: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ఆకు పూజ, విశేష అలంకరణ, నైవేద్య సమర్పణ చేసి హారతులు ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. అలాగే అగసలదిన్నె గ్రామంలోని ఆంజనేయస్వామి, సుళేకేరి శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి, ఎరిగేరిలోని పులిగట్టు ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు చేశారు.

కమనీయం.. గ్రామోత్సవం


పీఠాధిపతి శివయ్యస్వామికి తులాభారం

గోనెగండ్ల: మండల కేంద్రం గోనెగండ్లలోని వీరభద్రస్వామి దేవాలయంలో భద్రకాళిదేవి, వినాయకస్వామి, నందీశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు రెండు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. షాపూర్ జగద్గురు గిరి మల్లేశ్వర శివాచార్య మహాస్వామి ఆధ్వర్యంలో శనివారం దీక్షాహోమం, విగ్రహ గ్రామోత్సవం, శాంతిహోమం, వీరశైవమఠం పీఠాధిపతి శివయ్యస్వామి తులాభారం తదితర కార్యక్రమాలు జరిగాయి.

ప్రత్యేక అలంకరణలో మంగరాయుడు


మంగరాయ ఆంజనేయస్వామి

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో మంగరాయ ఆంజనేయస్వామి మహా రథోత్సవ కార్యక్రమం కనుల పండువగా సాగుతోంది. వేడుకల్లో భాగంగా మూడోరోజు శనివారం స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ మేనేజర్ కొప్రేష్ ఆచార్ ఆధ్వర్యంలో వేకువజాము నుంచి సుదర్శన హోమం, 101 లీటర్లతో క్షీరాభిషేకం, నైవేద్యం, మహామంగళ హారతి తదితర విశేష పూజలు చేశారు. అనంతరం పల్లకీసేవ, వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వైభవంగా పాతూరు ఆంజనేయస్వామి జాతర


పూజల్లో పాల్గొన్న అశేష భక్తజనం

ఆదోని రూరల్: మండలంలోని పాండవగల్ గ్రామంలో శనివారం పాతూరు ఆంజనేయస్వామి జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయం కిక్కిరిసిపోయింది. మహోత్సవం సందర్భంగా ఆలయ ధర్మకర్త ప్రతాపం వెంకటేశ్వర్లుశెట్టి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామికి నైవేద్యాలు సమర్పించారు. భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

ఉపాధి కూలీ మృతి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని దైవందిన్నె గ్రామంలో ఉపాధి హామీ పనులకు వెళ్లి గుండెపోటుకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. గ్రామానికి చెందిన మాల మల్లేష్(42) ఎప్పటిలాగే గురువారం ఉపాధి పనులకు వెళ్లాడు. పనులు చేస్తుండగా గుండె నొప్పి రావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కూలీలు వెంటనే చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతదేహాన్ని శనివారం ఉదయం గ్రామానికి తీసుకొచ్చారు. మృతుడికి భార్య సావిత్రి, నలుగురు సంతానం ఉన్నారు. మృతదేహానికి గ్రామ పెద్దలు, పంచాయతీ అధికారులు నివాళులర్పించారు.

17న ఫిట్ ఇండియా సైక్లింగ్

కర్నూలు (టౌన్): ఈనెల 17న ఫిట్ ఇండియా సైక్లింగ్ నిర్వహించనున్నట్లు సాయి (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) కర్నూలు సెంటర్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు ఔట్‌డోర్ స్టేడియం నుంచి ప్రారంభమయ్యే సైక్లింగ్ కార్యక్రమం పాత ఎస్పీ బంగ్లా మీదుగా ఆర్‌ఎస్ రోడ్డు, జ్యోతి మాల్, పాత కంట్రోల్ రూమ్, ఇండోర్ స్టేడియం, వైఎస్సార్ సర్కిల్ మీదుగా తిరిగి ఔట్‌డోర్ స్టేడియం చేరుకుంటుందన్నారు. కాలుష్య నివారణలో భాగంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.


ప్రభుత్వానికి వ్యతిరేకంగా మోకాళ్లపై కూర్చొని నిరసన తెలియజేస్తున్న కార్మికులు

మా గోడు పట్టించుకోండి

ఆదోని టౌన్: తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదోని మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. శనివారం ఏకంగా వారు కార్యాలయం ఎదుట మోకాళ్లపై కూర్చొని సర్కారు తీరుపై నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ పీరా, నాయకులు సోమన్న, అహ్మద్‌బాషా, శివకుమార్ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రమాదవశాత్తు మరణించిన కార్మిక కుటుంబానికి రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. 15 సంవత్సరాలు పైబడి పనిచేసిన వారిని రెగ్యులర్ చేయాలన్నారు. టెక్నికల్ వర్కర్లకు రూ.29,500, నాన్ టెక్నికల్ వర్కర్లకు రూ.26 వేలు ప్రకారం గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. ఈ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలు మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కరెప్ప, కృష్ణమూర్తి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


భక్తి గీతాలు ఆలపిస్తున్న కోయర్ టీం సభ్యులు

దైవ సందేశం

ఆదోని సెంట్రల్: ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకే ఏసుక్రీస్తు జన్మించినట్లు దైవ వర్తమానికులు ఆర్ఐఓ రామ సుబ్బన్న తెలిపారు. జెబీ గార్డెన్‌లో ఎంప్లాయిస్ ప్రొఫెషనల్ ఆధ్వర్యంలో సపోస్ క్రిసమస్ వేడుకలు శుక్రవారం రాత్రి నిర్వహించారు. క్రైస్తవులమని చెప్పుకొనే మనం దైనందిన జీవితంలో భయభక్తులు కలిగి జీవించాలని తెలి పారు. ఏసుక్రీస్తుపై ప్రతి ఒక్కరు విధేయత కలిగి ఆయన చూపిన బాటలో నడవాలన్నారు. జిల్లా విద్యాధికారి శ్యామూల్ పాల్, డీఎస్పీ సోమన్న, టూటౌన్ సీఐ సూర్యమోహన్ రావు, డీసీడీఓ స్నేహలత మాట్లాడుతూ యేసు సందేశాలను మననం చేసుకుంటూ క్రిస్మస్ వేడుకలు జరుపుకోవాలని సూచించారు. చంద్రశేఖర్ కోయర్ టీం క్రైస్తవ భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం కేక్ కట్ చేసి క్రిస్మస్ గ్రీటింగ్స్ తెలిపారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్, ప్రొఫెషనల్ కార్యక్రమ నిర్వాహకులు లూర్ద య్య, సంగటి దేవదానం, సుధాకర్,న్యూటన్‌రాజు, ఆదిమూర్తి,సునిల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మిగనూరు కోర్టులో కేసులను విచారిస్తున్న జడ్జి జోత్స్నదేవి

లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం

ఎమ్మిగనూరుటౌన్: లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందని జడ్జి టి.జోత్స్నదేవి అన్నారు. జూనియర్ సివిల్ కోర్టులో శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 1457 కేసులను జడ్జి పరిష్కరించారు. ఇందులో చెక్‌బౌన్స్‌కు సంబంధించి 80 కేసులు, ప్రామిసరీ నోట్, పబ్లిక్ న్యూసెన్స్, గేమింగ్ యాక్ట్ కేసులతో పాటు సివిల్ దావాలు, సారా కేసులు, అడ్మిషన్ కేసులు ఉన్నాయి. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ దీర్ఘకాలిక కేసుల పరిష్కారానికి రాజీ మార్గమే రాజమార్గమని చెప్పారు. కేసుల వల్ల సమయం, డబ్బు వృథాతో పాటు మానసిక ఒత్తిడి కూడా పెరుగుతుందన్నారు. ఇరుపక్షాల అంగీకారంతో కేసులను పరిష్కరించడమే లోక్ అదాలత్ లక్ష్యమన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకుంటే నేరాల అదుపులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో ఏపీపీ శ్రీలత, లోక్‌అదాలత్ మెంబర్ సాల్మాన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురురాజారావు, న్యాయవాదులు దామోదర్‌రెడ్డి, మురళీకృష్ణ, యేసేపు, రంగనాథ్, లింగమూర్తి, నబీరసూల్ పాల్గొన్నారు.

హామీల అమల్లో కూటమి ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రామాంజినేయులు

ఎమ్మిగనూరుటౌన్: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి రామాంజినేయులు విమర్శించారు. ఈనెల 29, 30 తేదీల్లో ఎమ్మిగనూరులో నిర్వహించనున్న సీపీఎం 23వ మహాసభలను విజయవంతం చేయడంపై శనివారం పట్టణంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల హామీలను విస్మరిస్తోందని మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని విమర్శించారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వలసలు నివారించి ఉపాధి చూపడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు, పత్తికొండ, మంత్రాలయం నియోజకవర్గాల్లో సాగు, తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రాజెక్టులు నిర్మించాలన్నారు.

దివ్యాంగులపై దయ చూపాలి


బహుమతులు ప్రదానం చేస్తున్న పాస్టర్లు

కౌతాళం: దివ్యాంగులు, అనాథులపై జాలి, దయ చూపాలని కర్ణాటక నార్తన్ డయాసిస్ అసోసియేట్ ట్రెజరర్ విజయఅమృత్ కనకరాజు, బళ్లారి ఏరియా చైర్మన్ అల్బర్‌సాన్స్ అన్నారు. మండల పరిధిలోని ఉరుకుంద సీఎస్ఐ కృపలాయి చర్చిలో శనివారం దివ్యాంగుల క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా వారు మాట్లాడారు. ఏసు క్రీస్తు సందేశాన్ని దివ్యాంగులకు వివరించారు. క్రీస్తు ఎలా అయితే దివ్యాంగులు, అనాథలపై దయ, జాలి చూపించారో అలాంటి ప్రేమను అందరూ చూపించాలన్నారు. అనంతరం దివ్యాంగులకు బహుమలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాస్టర్‌లు ఆనంద్ కుమార్, ప్రసాద్, సంతోష్ నాయకర్, రెవరెండ్‌లు జకరయ్య, విజయభాస్కర్ పాల్గొన్నారు.

విద్యుత్‌ను పొదుపు చేద్దాం


జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల పోస్టర్లు విడుదల చేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

ఆదోని అర్బన్: విద్యుత్‌ను పొదుపు చేసి భావితరాలకు వెలుగునిద్దామని విద్యుత్‌శాఖ ఆదోని, ఆలూరు ఏడీఈలు పురుషోత్తం, సంతోష్ అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. స్థానిక ఈఈ కార్యాలయం ఎదుట వారోత్సవాల పోస్టర్లను విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది విడుదల చేశారు. అనంతరం ఏడీఈలు మాట్లాడుతూ అవసరం మేరకు విద్యుత్‌ను ఉపయోగించాలన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఈఈ కార్యాలయం నుంచి ప్రధాన రహదారుల మీదుగా కోట్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ అధికారులు లోకేష్, నాయక్, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన చాకలి రంగప్ప

కోసిగి: మండల పరిధిలోని డి.బెలగల్ గ్రామానికి చెందిన చాకలి చిన్న రంగప్ప(48) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. చిన్న రంగప్ప మద్యానికి బానిసై రోజూ తాగుతూ భార్య పిల్లలతో గొడవ పడేవాడు. శనివారం ఉదయం మద్యం తాగి కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. మద్యం మత్తులో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన కోసిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య పద్మమ్మ, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సాహితీ గ్రంథాల ఆవిష్కరణ

కల్లూరు: భావనా ప్రియ సాహితీ వేదిక ఆధ్వర్యంలో శనివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో పుస్తకాల పరిచయ సభ నిర్వహించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, సాహితీ సభ అధ్యక్షుడు చంద్రశేఖర్ కల్కూర హాజరై ఆరు సాహితీ గ్రంథాలను ఆవిష్కరించి మాట్లాడారు. గనుమాల మునుస్వామి రచించిన స్వామి సంకీర్తనం (కీర్తనలు) పుస్తకాన్ని కె.వి.సుబ్బలక్ష్మమ్మ, రాణీలీలావతి రచించిన మనోజ్ఞ (నానీలు) పుస్తకాన్ని డాక్టర్ కర్నాట చంద్రమౌళిని, డాక్టర్ అనుగోలు సంజీవరాయుడు రచించిన తెలుగు ఘనత (పద్యం) పుస్తకాన్ని ఆవుల చక్రపాణి యాదవ్, రేవుల శ్రీనివాసులు రచించిన అందాల రాక్షసి (కంద పద్యాలు) పుస్తకాన్ని బైరోజు రాజశేఖర్, పుట్టా పునుగొండయ్య రచించిన సీమ చరిత శతకం (పద్యం) పుస్తకాన్ని భక్తుల రాణీలీలావతి సమీక్షించారు.

పోలీసుల తీరు ఆక్షేపణీయం

ఎమ్మిగనూరుటౌన్: మండల పరిధిలోని పార్లపల్లె గ్రామంలో సాగునీటి సంఘాల ఎన్నికల్లో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడమే కాకుండా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన చెన్నకేశవరెడ్డిని సీఎస్ సీఐ దూషిస్తూ అవమానించడం శోచనీయమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. అధికార పార్టీ కార్యకర్తల్లా పోలీసులు వ్యవహరించారని దుయ్యబట్టారు. రైతులను పోలింగ్ బూత్‌లోకి రాకుండా అడ్డుకోవడం ఎంత వరకు సమంజసమన్నారు. పోలింగ్ బూత్‌కు వంద మీటర్ల దూరంలో ఉన్నా ఓ సీనియర్ ఎమ్మెల్యేపై దురుసుగా ప్రవర్తించి ఆయన్ను వెనక్కు పంపడం వెనుక ఉద్దేశం ఏమిటని ప్రశ్నించారు. ఓటు హక్కులేని టీడీపీ నేతలు పోలింగ్ బూత్‌లో ఎందుకు ఉన్నారని, వారిని బయటకు పంపాలని మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ప్రశ్నిస్తే ఆయనపై సీఐ ప్రవర్తించిన తీరు ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేసేలా ఉందన్నారు. పోలీసు ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ కోత

కౌతాళం: మండల కేంద్రంలోని పలు ట్రాన్స్‌ఫార్మర్లు, వివిధ చోట్ల మరమ్మతు పనుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ నర్సప్ప తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మండల ప్రజలు గమనించాలన్నారు.

ఇద్దరికి గాయాలు

కోసిగి: మండల పరిధిలోని దుద్ది గ్రామ సమీపంలోని రిజర్వాయర్ వద్ద ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. శనివారం సాయంత్రం డి.బెళగల్ గ్రామానికి చెందిన బజారి, నరసింహులు హాల్వి నుంచి కోసిగి వైపు వస్తున్నారు. కోసిగి నుంచి మరో వాహనం హాల్వి వైపు వెళుతూ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బజారి, నరసింహులకు తీవ్రగాయాలు కావడంతో కోసిగి ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆదోనికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వన్ మెన్ కమిషన్‌ను రద్దు చేయండి

కర్నూలు(అర్బన్): షెడ్యూల్ కులాల వర్గీకరణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో నియమించిన వన్ మెన్ కమిషన్‌ను రద్దు చేయాలని మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాసారపు వెంకటేష్ కోరారు. శనివారం స్థానిక అంబేడ్కర్ భవన్ ముందున్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి చలో గుంటూరు కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును, భారత రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ ఆర్టికల్ 341ని నిర్వీర్యం చేయడమే అన్నారు.

క్రమశిక్షణ పేరుతో చితకబాదిన నిర్వాహకులు


విద్యార్థి ధర్మతేజ్‌కు అయిన గాయాలు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని గాంధీనగర్ వద్దనున్న విక్టరీ నవోదయ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు క్రమశిక్షణ పేరుతో విద్యార్థి ధర్మతేజ్‌ను చితకబాదడంతో గాయాలయ్యాయి. కోచింగ్ సెంటర్‌లో నవోదయ 5వ తరగతిలో ప్రవేశానికి కోచింగ్ తీసుకుంటున్నాడు. మార్కులు తక్కువ వచ్చాయని నిర్వాహకులు చితకబాదడంతో గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఉదయ్ అక్కడి వెళ్లి విద్యార్థిని పరామర్శించారు. నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సరైన వసతులు లేకుండా కోచింగ్ సెంటర్ నిర్వహిస్తూ విద్యార్థులను మానసింగా వేధిస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

కొనసాగుతున్న కార్మికుల దీక్ష


పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్లు

ఎమ్మిగనూరుటౌన్: సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక దీక్షలు శనివారం పదో రోజుకు చేరుకున్నాయి. ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజేంద్ర, నారాయణ, శివరామకృష్ణ, నరసప్ప ఆధ్వర్యంలో పట్టణంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టెక్నికల్, నాన్ టెక్నికల్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలన్నారు. 15 ఏళ్ల సర్వీసు ఉన్న కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. జాతీయ, రాష్ట్ర పండుగలకు సెలవు ప్రకటించాలని లేదా వేతన దినాలుగా ప్రకటించాలని కోరారు. హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలన్నారు. కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. సంఘం నాయకులు జాకీర్, వీరేష్, శివన్న, జనార్దన్, రాజేంద్రకుమార్, హంసరాజు, యూసుఫ్, రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

టమాట రైతు దిగాలు


పత్తికొండ మార్కెట్‌లో టమాట విక్రయాలు

పత్తికొండ(తుగ్గలి): ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధరలు లేకపోవడంతో టమాట రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. కొద్ది రోజులుగా పత్తికొండ మార్కెట్‌లో టమాట ధరలు అమాంతం పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శనివారం మార్కెట్‌లో కిలో రూ. 2, రూ.3 నుంచి ప్రారంభమై రూ.15 వరకు పలికింది. నాణ్యత పేరుతో వ్యాపారులు కొంత సరుకుకు మాత్రమే గరిష్ట ధర పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో చాలా మంది రైతులకు గిట్టుబాటు ధరలు లభించడం లేదు. ధరల పతనంతో కూలీలు కూడా గిట్టుబాటు కాక టమాట కాయలను పొలంపై వదిలేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. జిల్లా మార్కెటింగ్ సహాయ సంచాలకులు నారాయణమూర్తి, ఉద్యానవనశాఖ అధికారి రామాంజనేయులు మార్కెట్‌ను సందర్శించారు. టమాట కొనుగోళ్లను తనిఖీ చేసి వ్యాపారులు, రైతులతో మాట్లాడారు. కేజీ టమాట రూ.4 చొప్పున తప్పనిసరిగా కొనుగోలు చేయాలని, నాణ్యమైన టమాటకు సరైన ధర చెల్లించాలని ఆదేశించారు. శనివారం మార్కెట్‌కు 42 టన్నుల టమాట ఉత్పత్తులు రాగా కనిష్టంగా క్వింటాల్ ధర రూ.1000, గరిష్టంగా క్వింటాల్ రూ. 2వేలు, మధ్య ధర క్వింటాకు రూ.1500 పలికిందని చెప్పారు. సేకరించిన 8టన్నులు విజయవాడ రైతు బజార్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. మార్కెట్‌యార్డు కార్యదర్శి కార్నలీస్ పాల్గొన్నారు.

కపటిలో ఇరువర్గాల గొడవ


ఈరన్నకు వైద్యం అందిస్తున్న వైద్య సిబ్బంది

ఆదోని అర్బన్: మండలంలోని కపటి గ్రామంలో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. శనివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు.. ఈరన్న , వెంకటేష్ కుటుంబాల మధ్య మనస్పర్థలున్నాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి వెంకటేష్.. వెంకటస్వామి, రవిరాజుతో కలిసి ఈరన్న కుటుంబసభ్యులపై దాడి చేశాడు. కంట్లో కారం చల్లి ఇనుపరాడ్లతో కొట్టాడు. కొద్దిసేపటికి తన బంధువులతో కలిసి ఈరన్న వెంకటేష్‌పై దాడి చేశాడు. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన ఆరుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులు ఆదోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నట్లు ఇస్వీ పోలీసులు తెలిపారు. గొడవ పడిన ఇరువర్గాలు బీజేపీకి చెందిన వారే కావడం గమనార్హం.

సాగునీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ ఓవరాక్షన్


మిట్టసోమపురంలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళా రైతులు

గోనెగండ్ల: పరుగు పందెంలో పాల్గొన్నది ఒక్కడే నాకే ఫస్ట్ ప్రైజ్ అన్నట్లు సాగునీటి సంఘాల ఎన్నికలను టీడీపీ ప్రభుత్వం కొనసాగించింది. వైఎస్సార్‌సీపీ ఎన్నికలను బహిష్కరించిన తరువాత టీడీపీ నాయకుల హడావుడి అంతాఇంత కాదు. ఎన్నికలు మొత్తం పోలీసు పహారాలో సాగాయి. గాజులదిన్నె ప్రాజెక్టు పరిధిలో ఐదు సంఘాలకు, తుంగభద్ర దిగువ కాలువ పరిధిలో మూడు సంఘాలకు శనివారం ఎన్నికలు జరిగాయి.

అధ్యక్ష, ఉపాధ్యక్షులు వీరే..

జీడీపీ కింద ఐదు సాగునీటి సంఘాల్లో హెచ్. కై రవాడికి అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా రామ నరసప్ప, ప్రేమర ఏసన్న, ఒంటిడుదిన్నెకు బీటీ బడేసాబ్, చాకలి నాగన్న, తిప్పనూరు కాలువకు బోయ కౌలుట్ల, చిన్న రాముడు, ఎస్. లింగందిన్నె కాలువకు కురువ రంగన్న, ఉప్పర రాముడు, కున్నూరు కాలువకు బోయ కృష్ణయ్య, లక్ష్మీదేవీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఎల్లెల్సీ కింద మూడు సంఘాల్లో డీపీ 86 కాలువకు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఉసేన్, గొల్ల మల్లేష్, పీడీ కాలువకు రంగముని, రంగస్వామి, ఎంఎల్ఎస్‌పీ కాలువకు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా కె.శ్రీనివాసులు, కె. కృష్ణమూర్తిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

- కౌతాళం: కౌతాళం-1 సంఘానికి అధ్యక్షుడిగా రఘురాం, ఉపాధ్యక్షుడిగా రామాంజినేయరాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కౌతాళం-2కు ఓబుళాపురం సిద్ధప్ప, రంగస్వామి, రౌడూరు సాగునీటి సంఘానికి పంపాన్నగౌడ్, మహబూబ్‌సాబ్, సుళేకేరికి గుండప్ప, నాగభూషణం, బదినేహాల్‌కు టిప్పుసుల్తాన్, లక్ష్మి, కుంబళనూరుకు మహేష్, ఈరన్న, హాల్వి సాగునీటి సంఘానికి అధ్యక్షుడిగా భీమన్న, ఉపాధ్యక్షుడిగా చిన్నఈరన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే వల్లూరు చెరువు మైనర్ సంఘానికి అధ్యక్షుడిగా దేవప్పగౌడ్, ఉపాధ్యక్షుడిగా ఎల్లప్పలను ఎన్నుకున్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం

ఆదోని రూరల్: మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం ఉద్రిక్త పరిస్థితుల మధ్య ఏకగ్రీవమయ్యాయి. మొత్తం 4 మైనర్ ఇరిగేషన్ కింద ధణాపురం, నాగనాథనహళ్లి, ఇస్వీ, పెద్ద హరివాణం గ్రామాల్లో ఎన్నికలు జరిగాయి. టీబీపీ(ఎల్లెల్సీ) మెంబర్ల ఎన్ని కలు సంతెకూడ్లూరు-07, పెద్దహరివాణం-06 వాటికి ఎన్నిక జరగాల్సి ఉండగా, పెద్దహరివాణంలో ఏకగ్రీవమైంది. సంతెకూడ్లూరులో కమిటీ మెంబర్-07 ఎన్నికలు నిర్వహించారు. మైనర్ ఇరిగేషన్ కింద ఇస్వీ సాగునీటి సంఘం అధ్యక్షుడిగా విరూపాక్షిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా సిద్దిక్‌వలీ, పెద్దహరివాణం సాగునీటి సంఘం అధ్యక్షుడిగా బీఎం ఉసేని, ఉపాధ్యక్షుడిగా రంగస్వామి, నాగనాథనహళ్లి సంఘానికి అధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడిగా జగన్నాథ్, ధణాపురం సాగునీటి సంఘం అధ్యక్షుడిగా శివకుమార్, ఉపాధ్యక్షుడిగా వీరభద్రగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీబీపీను పెద్దహరివాణంలో ఏకగ్రీవంగా గురులింగప్ప అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా వీరనాగప్ప, సంతెకూడ్లూరులో అధ్యక్షుడిగా రామస్వామి, ఉపాధ్యక్షుడిగా విష్ణులను ఎన్నుకున్నారు.

- **ఖాకీల కనుసన్నల్లో ఎన్నికలు**

పందవరం: మండలంలో ఖాకీల కనుసన్నల్లో సాగునీటి ఎన్నికలు జరిగాయి. గురజాల గ్రామంలో 12 స్థానాలకు గాను 10 ఏకగ్రీవం అయ్యాయి. మిట్టసోమపురం గ్రామంలో 12 స్థానాలకు గాను కూటమి ప్రభుత్వం 10 స్థానాలను ఏకగ్రీవం చేసుకుంది. అధికార పార్టీ నేతలు ఏకగ్రీవం కావాలనే ఉద్దేశంతో ఇతరులు పోటీ చేయకుండా పోలీసులు అక్కడికి వచ్చిన వారిని తరిమికొట్టారు.

సాగునీటి సంఘాల ఎన్నికలను బహిష్కరించాం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి

పెద్దకడబూరు: సాగునీటి సంఘాల ఎన్నికలను వైఎస్సార్‌సీపీ బహిష్కరించినట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. కూటమి నేతల అరాచకాల కారణంగా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తాము ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలిపారు. వారి వెంట నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, రవిచంద్రారెడ్డి, జాము మూకయ్య ఉన్నారు.